క్లుప్తంగా

సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజా పంపిణీ ద్వారా బియ్యం, చక్కెర, తదితర నిత్యావసర సరుకుల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా చౌకదుకాణ డీలర్లు, ఎండీయూ(మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) ఆపరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ తూకాల్లో తేడాలు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయించాలని హెచ్చరించారు. డీలర్లు, ఎండీయూలు అక్రమాలకు పాల్పడితే వారిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పుల్లయ్య, వీఆర్ఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకోవాలి

కోవెలకుంట్ల: జిల్లాలోని దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా నాయకులు రమణ, నారాయణరెడ్డి కోరారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లా నరసరావు పేటలో జరిగిన బహిరంగ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమానికి 32 హామీలు ఇచ్చారన్నారు. హామీల్లో ఒకటైన ఇళ్ల స్థలాల పంపిణీలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇంటి స్థలంతోపాటు పక్కాగృహాలు కేటాయించాలన్నారు. అలాగే వచ్చే నెలలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి రూ. 6 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ ఇన్సూరెన్స్‌ను ఆయా రంగాల కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వరప్రసాదరావు సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు మినహా మిగిలిన అన్ని వర్గాల కూలీలు ఇన్సూరెన్స్‌కు అర్హులేనన్నారు. రేషన్ కార్డు ఉండి 18 నుంచి 55 సంవత్సరాల్లోపు వయసు కలిగిన స్త్రీ, పురుషులు ఇన్సూరెన్స్ చేసుకోవచ్చని చెప్పారు. ఏడాదికి రూ. 22 చొప్పున ఐదు సంవత్సరాలకు ఒకేసారి రూ. 110 చెల్లించాల్సి ఉందన్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు చలానా జతచేసి లేబర్ ఆఫీస్‌లో అందజేయాలన్నారు. పాలసీదారు సహజ మరణం పొందితే రూ. 1.30 లక్షల ఇన్సూరెన్స్, ప్రమాదశాత్తు మరణిస్తే రూ.6 లక్షల బీమా సాయం అందుతుందన్నారు.

కుష్టు వ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



ఎల్‌సీడీసీ సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారద

బనగానపల్లె రూరల్ : కుష్టువ్యాధి గ్రస్తుల సర్వే(ఎల్‌సీడీసీ)ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారద సూచించారు. బుధవారం మండలంలోని టంగుటూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే గ్రామంలో జరుగుతున్న ఎల్‌సీడీసీ సర్వేను పరిశీలించి లెప్రసి సర్వే పై ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లుకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివ శంకరుడు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

31 నుంచి ఉరుసు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా అల్లాబకాష్ దర్గా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 31 నుంచి నిర్వహించనున్నట్లు గ్రామస్తు లు తెలిపారు. 31న గంధం, ఫిబ్రవరి 1న ఉరు సు, 2న కిస్తీ ఉంటుందన్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఫిబ్రవరి 1న ఏపీ, తెలంగా ణ రాష్ట్రస్థాయి పాల పండ్ల ఎద్ల బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అంతర్రాష్ట్ర హోమ్ టీమ్స్ కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. కబడ్డీ పోటీలలో పాల్గొనే వారు 7989866247, ఎద్ల బండలాగుడు పోటీల్లో పాల్గొనే వారు 6300605620 నంబర్లను సంప్రదించాలన్నారు.

శనగ పంటకోత ప్రయోగం



పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామ పరిధిలోని బుధవారం శనగలో పంట కోత ప్రయోగం చేశారు. రబీలో సాగు చేసిన శనగ పంటను 25 స్క్వయర్ మీటర్లు కోసి, వచ్చిన పంటను తూకం వేయగా 4.520 కేజీల దిగుబడి వచ్చింది. ఈ లెక్కన ఎకరాకు సుమారు 7 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని ఏఎస్ఓ దేవదాసు, ఏఈఓ బెన్నిరాజు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ సుధాకర్, ఇన్సూరెన్సు అధికారి కళ్యాణ్ పాల్గొన్నారు.

బాబు నిజస్వరూపం తెలిసిపోయింది

- సూపర్ సిక్స్ పథకాల అమలుపై చేతులెత్తేశారు
- ప్రశ్నిస్తే అక్రమ కేసులు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : సీఎం చంద్రబాబు నిజస్వరూపం ప్రజలకు తెలిసి పోయిందని, ఎన్నికల ముందు ఆయన మాయమాటలు నమ్మి ఓట్లు వేసి గెలిపించామని ప్రజలు బాధపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచార సమయంలో సూపర్‌సిక్స్ హామీలిచ్చి పథకాలను తప్పక అమలు చేస్తాంటూ చంద్రబాబు ఇంక మరెన్నో హామీలు ఇచ్చారన్నారు. నేడు రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నందున నేరవేర్చడం కష్టమంటూ పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. అప్పులు తీర్చి, సంపదను సృష్టించి ఇచ్చిన హామీలను నేరవేర్చి ఈ రాష్ట్రాన్ని కాపాడలంటే నేను తప్ప గత్యంతరంలేదని నాడు చంద్రబాబు చెప్పిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దావోస్ వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తే, చంద్రబాబు ఏ విధమైన పెట్టుబడులు తీసుకురాలేదని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని చెప్పారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రశ్నిస్తే వారి పై తప్పుడు కేసులు బనాయిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పథకాలు అమలు చేయలేకపోగా అమరావతి, వైజగ్‌స్టీల్ ప్లాంట్ అభివృద్ధి, పొలవరం నిర్మాణం చేయాలంటూ సాకులు చెబుతూ మాటమార్చుతున్నారని విమర్శించారు. ఫిబ్రవరి 1 నుంచి భూముల రిజిస్ట్రేషన్ల ధరలు పెరుగుతున్నాయని, మరిన్ని విద్యుత్ చార్జీలు కూడా పెరుగుతున్నాయన్నారు. ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టే ఉద్యమాలకు ప్రజలు సంపూర్ణంగా సహకారం అందించాలని కోరారు. బనగానపల్లె ప్రాంతంలో గ్రావెల్ అక్రమ రవాణ జరుగుతున్నా మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, టీడీపీ నాయకులు వక్ఫ్ భూములు, దేవదాయ భూముల్లో మైనింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు తోరణాలు దగ్ధం

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామంలో రైతుల పొగాకు తోరణాలు బుధవారం దగ్ధం అయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు దత్తయ, టైటస్‌లు ఆరబెట్టిన పొగాకు తోరణాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. గమనించిన సమీపంలోని రైతులు మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే దాదాపు రూ.10 వేలు విలువగల పొగాకు కాలి బూడిద అయ్యింది. ఆ ప్రదేశంలో దాదాపు రూ.10 లక్షలు విలువగల పొగాకు పంట ఉందని, కొంచెం ఆలస్యమైవుంటే మొత్తం కాలి బూడిద అయ్యేదని రైతులు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్యాపిలి: మండల పరిధిలోని అలేబాదుతండా సమీపంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు రాచర్ల ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో 1,000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులతో బుగ్గన సమావేశం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి

బేతంచెర్ల: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో రాష్ట ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ ముర్తుజావలీ, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో ఘర్షణకు పాల్పడొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

కొలిమిగుండ్ల: క్షణికావేశంలో ఎవరూ గొడవలకు పోవొద్దని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ సూచించారు. కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌తో పాటు ఆవరణలో గతలంలో దాతల సహకారంతో నిర్మించిన షటిల్ కోర్టు, పార్కును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. శాంతి భద్రతలపై పూర్తిగా దృష్టి సారిస్తామన్నారు. ప్రస్తుతం భూముల వివాదాలపైనే గొడవలు జరుగుతున్నా యని చెప్పారు. వివాదాలు వచ్చినపుడు ఇరువర్గాలు ఘర్షణలకు దిగకుండా సమస్యను పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. లాంగ్ పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సీఐ రమేష్ బాబుకు సూచించారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: హనుమాన్ నగర్‌కు చెందిన తలారి మద్దిలేటి బుధవారం రైల్వే బ్రిడ్జి వద్ద నాటుసారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు. సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేశామన్నారు. తలారి మద్దిలేటిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

డోన్ టౌన్: ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు రంగనాయకులు బుధవారం ఆర్డీఓ నరసింహులను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆంజనేయస్వామికి పూజలు

డోన్ టౌన్: మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామ సమీపంలోని కొండల్లో వ్యాసరాయ మహర్షి ప్రతిష్ఠించిన బంగారుకొండ పాత పాలెం అభయాంజనేయ స్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డైరీల పంపిణీ

డోన్ టౌన్: స్థానిక కోర్టు ఆవరణంలో టీటీడీ డైరీలను బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మాధవకృష్ణారెడ్డి బుధవారం న్యాయవాదులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శేషశయనరావు, శ్రీనివాసులశెట్టి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

కొండకు నిప్పు

డోన్ రూరల్: మండల పరిధిలోని వెంటనాయునిపల్లి గ్రామం వద్ద ఉన్న కొండకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగాయి. డోన్ ఫారెస్ట్ అధికారులు అక్కడికి వెళ్లి ఆర్పే ప్రయత్నం చేస్తున్నట్లు రేంజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోండి

బేతంచెర్ల: మద్దతు ధరతో కంది దిగుబడులు విక్రయించుకునేందుకు రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ కిరణ్‌కుమార్ బుధవారం రైతులకు సూచించారు.

హాస్టల్ విద్యార్థులకు రూ.60 విరాళం

డోన్ టౌన్: హైస్కూల్, కళాశాల్లో చదివే హాస్టల్ విద్యార్థుల అభ్యున్నతి కోసం వివేకానంద సేవా సమితికి దాత శ్రీనివాసరెడ్డి రూ.60 వేల విరాళాన్ని అందించినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి బుధవారం తెలిపారు.

బేస్‌మెంట్ కట్టడాల కూల్చివేత



ఇందిరమ్మ కాలనీలో జేసీబీ సాయంతో బేస్‌మెంట్‌ను తొలగిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీల్లో ఇటీవల చేపట్టిన బేస్‌మెంట్ కట్టడాలను బుధవారం అధికారులు కూల్చివేశారు. కోవెలకుంట్ల శివారులోని కోర్టు వెనుక, ఎస్సార్బీసీ కాలనీల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేశారు. వీఆర్ఓలు, సర్వేయర్లు ఆయా కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల స్టేటస్‌పై ఐదు రోజుల క్రితం సర్వే నిర్వహించారు. విషయం తెలుసుకున్న అధికారులు సర్వే జరిగిన తర్వాత కొందరు లబ్ధిదారులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను జేసీబీ సాయంతో పడగొట్టారు. ఇన్ని రోజుల నుంచి ఇళ్ల నిర్మాణాలను ఎందుకు చేపట్టలేదని, సర్వే చేసిన తర్వాత అప్పటికప్పుడు నిర్మాణాలు ప్రారంభించిన కారణంగానే కట్టడాలను కూల్చి వేస్తున్నట్లు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతుంటే అర్ధంతరంగా కూల్చివేయడమేమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

చెరువుల పరిశీలన



వెంగళాంపల్లి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి/డోన్ రూరల్: ప్యాపిలి మండల పరిధిలోని ఏనుగుమర్రి, వెంగళాంపల్లి, ప్యాపిలి, గుడిపాడు చెరువులను, డోన్ మండలంలోని కొచ్చెర్వు, దేవరబండ గ్రామాల చెరువులను బుధవారం డోన్ ఎమ్మె ల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ప్యాపిలి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్యాపిలి మండలంలో 38 చెరువులకు గాను 32 చెరువులకు నీరు నింపే ప్రక్రియ జరుగుతోందన్నారు. మరో ఏడాదిలోగా అన్ని చెరువులకు నీరు నింపి రైతులకు సాగునీటి కష్టాలను తీరుస్తామన్నారు.

ఆధార్ నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డోన్ డివిజన్ డీఎల్‌డీఓ నరసింహారెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలో పెండింగ్‌లో ఉన్న శిశువుల ఆధార్ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని డోన్ డివిజన్ డీఎల్‌డీఓ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులుతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువు ఆధార్ నంబరు నమోదు చేసుకునేలా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న ప్రతి ఇంటిని జీయోట్యాగ్ చేసి, ఇంటి పన్నుల వసూళ్లు వందశాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్‌రెడ్డి, పలుకూరు ఈఓ బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు



పూజలందుకున్న అభయాంజనేయ స్వామి

బేతంచెర్ల: స్థానిక బైటిపేట గాడు బావి వీరాంజనేయ స్వామి, గౌరి పేట ఆంజనేయ స్వామి, పలక చింత మాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల తోపాటు సిమెంట్‌నగర్ గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో నిర్వాహకులు రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తులు పూజలు చేశారు.

340 పశువులకు వైద్యపరీక్షలు

కోవెలకుంట్ల: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని భీమునిపాడులో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 340 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కోవెలకుంట్ల పశువైద్యాధికారి కృష్ణకుమార్ తెలిపారు. పశు వైద్య శిబిరంలో 15పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, 92 బొబ్బవ్యాధి టీకాలు, 222 దూడలు, పశువులు, జీవాలకు నట్టల నివారణ, రెండు మూడు ఎద సూదులు, ఎనిమిది గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసినట్లు వెల్లడించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: తన భర ఎద్దుల విజయుడు వేధింపులకు గురిచేస్తున్నాడని పట్టణంలోని బోయపేట కాలనీకి చెందిన ఎద్దుల పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య బుధవారం తెలిపారు.

మృతదేహం లభ్యం

కాశినాయన: మండలంలోని అంబవరం గ్రామ సమీపంలోని తెలుగుగంగ ఎడమ కాలువలో మృతదేహం లభ్యమైనట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం దేవరపల్లె గ్రామానికి చెందిన దేశిరామయ్య, లక్ష్మిదేవి దంపతులు రెండు నెలల క్రితం స్వగ్రామం నుంచి వచ్చి తోట్లపల్లె గ్రామంలోని అచలానంద ఆశ్రమంలో ఉండేవారు. మంగళవారం దుస్తులు ఉతుక్కునేందుకు తెలుగుగంగ ఎడమ కాలువలోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు రామయ్య (62) నీళ్లలో పడిపోయాడు. బుధవారం అంబవరం సమీపంలోని తెలుగుగంగ ఎడమ కాలువలో మృతదేహం ఉన్నట్లు గుర్తించి వెలికి తీశామని సీఐ తెలిపారు.

పదోన్నతులు కల్పించాలి

డోన్ టౌన్: అర్హత కలిగిన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరామ్, మండల, పట్టణ అధ్యక్షులు రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డివిజన్ నాయకులు రామచంద్రుడు బుధవారం ఆర్డీఓ కార్యాలయ అధికారి నరసింహులును కలిసి వినతి పత్రం అందజేశారు.

పశుపోషణపై అవగాహన

డోన్: పశు పోషణపై యజమానులకు అవగాహన ఉండాలని పశువైద్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు. కొత్తకోట, నక్కవాగులపల్లె గ్రామాల్లో సర్పంచ్ చంద్రన్న ఆధ్వర్యంలో బుధవారం పశువైద్యశిబిరం ఏర్పాటు చేసి పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కోసం ద్రావకాన్ని తాపించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మత పెద్దలతో నూతన కార్యవర్గ సభ్యులు


బేతంచెర్ల: ముస్లిం యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మండల ఖాజీ నూర్‌అహ్మద్, ముస్లిం మత పెద్దలు మూర్తుజావలీ, అహ్మద్ హుసేన్ సూచించారు. బుధవారం శ్రీనగర్ కాలనీల్లోని షాదిఖానాలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఖాజా హుస్సేన్, కరిముల్లా, జాయింట్ సెక్రటరీగా జుబేర్ ఖాన్ ఉపాధ్యక్షులు వలిబాషా, ట్రెజరర్‌గా అబ్దుల్ సలామ్, మీడియా కో ఆర్డినేటర్ హిమాయత్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. వారితో ముస్లిం మత పెద్దలు ప్రమాణ స్వీకారం చేయించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షుల నియామకం

కోవెలకుంట్ల /డోన్ టౌన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల అధ్యక్షులను నియమిస్తూ బుధవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు వివరాలు..

అనుబంధ విభాగం	బనగానపల్లె నియోజకవర్గం అధ్యక్షుడు	డోన్ నియోజకవర్గం అధ్యక్షుడు
యూత్	పరం నంద కిషోర్‌రెడ్డి	ఆర్‌ఈ రాజవర్ధన్
మహిళ	షేక్ షాజహాన్	దూదేకుల అమ్మని
రైతు విభాగం	కానాల రవీంద్రనాథరెడ్డి	కమతం భాస్కర్‌రెడ్డి
బీసీ. సెల్	బోయ వీర జగదీష్	తాపల మద్దిలేటి నాయుడు
ఎస్సీ సెల్	గోపాజీ సత్యమన్న	తిక్క వెంకటేశ్వర్లు
ఎస్టీ సెల్	సుగాలి లక్ష్మానాయక్	లోటావత్ రామతీర్థంనాయక్
మైనార్టీ, క్రిస్టియన్ సెల్	షేక్ ఉసేన్, ఇట్టె కరుణాకర్	షాదిక్ అహ్మద్, నిత్యానందం
స్టూడెంట్	పూజారి శ్రీనివాసులు	పాబోలు ప్రకాష్‌రెడ్డి
పంచాయతీరాజ్	ఈశ్వరరెడ్డి	పాలపోలా చంద్రశేఖర్‌రెడ్డి
ఆర్‌టీఐ	మొలక రాజారెడ్డి	మిడుతూరి రాఘవేంద్రారెడ్డి
వలంటీర్	రవికుమార్	పసుళ్ళ కీర్తి
గ్రీవెన్స్‌వింగ్	పేరం ప్రసాదరెడ్డి	రాచెర్ల నాగిరెడ్డి
వాణిజ్యం	ఇటికెల చిన్న పుల్లయ్య	రాజా మురలీ కృష్ణ
చేనేత	గోరెంట్ల వెంకటరమణ	బి.శివశంకర్
వైఎస్సార్‌టీయూసీ	షేక్ మహమ్మద్‌హుసేన్	యాపమాను ఎర్రమల
అంగన్‌వాడీ	కుమ్మరి సురేష్‌బాబు	వెంగోటి మంజుల
లీగల్ సెల్	అబ్దుల్ ఖైర్	ఎదురింటి మధుసూధన్ రెడ్డి
కల్చరర్	జమ్మయ్య	ఆర్ .సలీం
సోషల్ మీడియా	కుమ్మర చంద్రమౌళీశ్వర ఆచారి	తంబటి సతీష్
ఐటీ	బిందుకూర్ సురేష్‌బాబు	అల్లూ రామ్‌కుమార్
దివ్యాంగుల సంఘం	అరదేశి సుబ్బరాయుడు	దేవిశెట్టి ఉదయ్ భాస్కర్
డాక్టర్ల విభాగం	దూదేకుల మహమ్మద్‌హుసేన్	బంగారు జయచంద్ర
ఇంటెలెక్చువల్స్ ఫోరం	పెద్ద దస్తగిరి	గుట్టాలపల్లి శ్రీనివాసులు
బూత్‌కమిటీ	తల్లం సుబ్రమణ్యం	మేడబోయిన చిరంజీవి
ప్రచార విభాగం	సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి	బోరెడ్డి రామచంద్రారెడ్డి

కులవివక్షను రూపుమాపుదాం



మాట్లాడుతున్న విరజానందస్వామి

కొలిమిగుండ్ల: కులవివక్షను రూపుమాపి స్వశక్త హిందూ సమాజాన్ని నిర్మించుకుందామని బ్రహ్మంగారి మఠానికి చెందిన అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సమరసత యాత్ర రెండో రోజు బుధవారం రాఘవరాజుపల్లె, అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె, ఎస్.చెన్నంపల్లె, తిమ్మనాయినపేట గ్రామాల్లో సాగింది. కార్యక్రమంలో స్వాత్మానందస్వామి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, సామాజిక సమరసత సభ్యులు గోరంట్ల రమణ, ఏవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రిస్కిప్షన్ ఉంటేనే మందులు విక్రయించాలి



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్

బేతంచెర్ల: డాక్టర్ ప్రిస్కిప్షన్ ఉంటేనే మందులు విక్రయించాలని జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ మెడికల్ షాపు నిర్వాహకులకు సూచించారు. బుధవారం పట్టణంలోని మెడికల్ షాపులను పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం అమ్మవారిశాలలో ఆమె మెడికల్ షాపులు, ప్రైవేట్ క్లినిక్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిషేధించిన మందులను విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

మద్యం దుకాణాలకు గీత కార్మికులు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

కోవెలకుంట్ల: జిల్లాలో గీత కార్మికులకు 11 మద్యం దుకాణాలు కేటాయించామని, వాటికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడిగ, గౌడ కులాలకు సంబంధించి జిల్లాలో ఉయ్యాలవాడ, నంద్యాల, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పగిడ్యాల, ఆళ్లగడ్డ, డోన్, డోన్ రూరల్, ఆత్మకూరు, కొత్తపల్లె, పాములపాడు గ్రామాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తులు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 5వ తేదీ వరకు గడువు ఉందన్నారు. రూ. 2 లక్షల దరఖాస్తు రుసుం చెల్లించాలని, ఈ మొత్తం వాపసు ఇవ్వబడదని వెల్లడించారు. 7వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు, ఆ శాఖ సీఐ తకీబాష, ఎస్ఐ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శనగలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రకుమార్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సేంద్రియ వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని టంగుటూరు, నందవరం, ఇల్లూరుకొత్తపేట గ్రామాలోని పలు పంటలను ఏఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించారు. నరేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా పెట్టుబడి నియంత్రించుకోవచ్చన్నారు. వ్యవసాయంలో సేంద్రియ విధానం అవలంబించడం వల్ల భూమి ఆరోగ్యం బాగుపడి, నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్నారు. రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి రఘువరణ్ తదితరులు పాల్గొన్నారు.